క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ కామేశ్వరరావు

జరుగుమల్లి(సింగరాయకొండ): పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి స్వచ్ఛ పంచాయతీగా కామేపల్లి గ్రామాన్ని తీర్చిదిద్దాలని డిప్యూటీ ఎంపీడీఓ జీవీ కామేశ్వరరావు సూచించారు. జరుగుమల్లి మండలం కామేపల్లి పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు, ఇంటిపన్ను వసూలు ప్రక్రియను పరిశీలించారు. ఇంటి పన్ను చలానాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాలని వివరించారు.

నేడు మండల సమావేశం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..హనుమంతునిపాడు, మోరవారిపల్లి మధ్యలో కంభం కనిగిరి రహదారిలో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హనుమంతునిపాడుకు చెందిన ఆర్నూరి రమేష్ , మహిళా కూలి బాలమ్మ బేల్దారి కూలి పనికి బైక్‌పై మొరవారిపల్లి వెళుతున్నారు. ఆ సమయంలో మొరవారిపల్లి, హనుమంతునిపాడు మధ్య కంభం కనిగిరి రహదారిలో వేములపాడు వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని బైకు ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో రమేష్, బాలమ్మకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో కనిగిరి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

గేదెల దొంగలు అరెస్టు


గేదెలు చోరీ చేసిన దొంగలు

సింగరాయకొండ: గేదెలు అపహరించిన ఇద్దరు దొంగలను సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల విలువైన 5 గేదెలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.మహేంద్ర మంగళవారం తెలిపారు. ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం..జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన బక్కముంతల ప్రసాద్, రావినూతల కొండలరావు సోమరాజుపల్లి పంచాయతీకి చెందిన అగ్రిబోయిన బ్రహ్మయ్య షెడ్డులోని గేదెలను చోరీ చేశారు. అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై మహేంద్ర వివరించారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర నాయక్

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై యం.వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం విద్యాలయం ప్రిన్సిపాల్ షేక్.రేష్మ అధ్యక్షతన ఎస్సై వెంకటేశ్వర నాయక్ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయినులుకూడా విద్యార్థినుల భద్రతపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

పరిమితికి మించితే చర్యలు


వాహన తనిఖీలు చేస్తున్న డీఎం, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

కనిగిరిరూరల్: ఆటోల్లో, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులకు తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ అన్నారు. కనిగిరి ప్రాంతంలో మంగళవారం డిపో మేనేజర్ మొహమ్మద్ సయనాబేగం ఆధ్వర్యంలో వాహన తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధృవ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వారికి, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న వారికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

సతాయిస్తున్న సర్వర్లు..!

- ఇక్కట్లు పడుతున్న దరఖాస్తుదారులు..
- సచివాలయల వద్ద గంటల తరబడి నిరీక్షణ..


సచివాలయంలో దరఖాస్తు దారులు

కనిగిరిరూరల్:

ఓ వైపు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరణ, ఆధార్ అప్డేట్, అన్నదాత సుఖీభవ కోసం రైతుల ఈకేవైసీ, విద్యార్థుల అధార్ అప్డేట్, పాతరేషన్ కార్డు దారులకు ఈకేవైసీ ఇలా అనేక ప్రక్రియల కోసం ప్రజలు సచివాలయాలు, ఆధార్ కేంద్రాలు చుట్టు తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. దరఖాస్తుదారులకు సర్వర్ సమస్య సతాయిస్తుండటం.. రెవెన్యూ, సచివాలయ, రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యోగులు బదిలీల ప్రక్రియలతో వారి పనుల్లో బీజీబీజీగా నిమగ్నమై.. దీనిపై సక్రమంగా దృష్టి సారించి కార్యాలయాల్లో కొలువులు తీరకపోతుండటంతో ప్రజల అవస్థలు వర్ణణాతీతంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలం తర్వాత కొత్తరేషన్ కార్డులకు వెబ్‌సైట్ ఓపెన్ కావడంతో ఇప్పటి వరకు వేచి ఉన్న ప్రజలు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. రేషన్ కార్డులకు సంబంధించిన ఏడు రకాల దరఖాస్తుల అప్‌లోడ్, పాఠశాల విద్యార్థుల వివిధ రకాల ధృవీకరణ పత్రాల కోసం విద్యార్థులు, అధార్ కార్డులోని అనుసంధాన ప్రక్రియ, ఈకేవైసీ, రైతుల పథకాలకు సంబంధించి ఈకేవైసీ ఇలా అన్ని ప్రక్రియలు అన్ని ఒకేసారి ప్రారంభం కావడంతో సర్వర్లు సతాయిస్తున్నాయి. దీంతో దరఖాస్తుదారులు గంటల తరబడి సచివాలయాల వద్ద నిరీక్షిస్తున్న పరిస్థితి.

కిటకిటలాడుతున్న సచివాలయాలు..

పట్టణాల్లో సచివాలయాలు దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా అధార్ అప్‌డేట్, ఈకేవైసీ, రేషన్ కార్డుదారుల నమోదుల ప్రక్రియ వేగవంతంగా జరగాల్సి ఉండటంతో విద్యార్థులు, నూతన కార్డుదారులు బారులుతీరుతున్నారు. దీనికి తోడు రైతు పథకాల లబ్ధిదారుల ఈకేవైసీ కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు చెప్పడంతో రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పరిగెడుతున్నారు.

☛ కనిగిరి మండలంలో 26,178 కార్డుదారులు ఉండగా, అందులో 77,889 మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. వారిలో 3,719 మంది కార్డుదారుల్లోని సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. అలాగే ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల కోసం 2,847 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కనిగిరి మండలంలో సుమారు 13 వేల మంది సెటిల్‌మెంట్, అసైన్డ్ రైతులు ఉండగా.. వీరిలో తొలివిడతగా సుమారు 7,800 మంది సెటిల్‌మెంట్ రైతులను అన్నదాత సుఖీభవ అర్హుత జాబితాలో చేర్చారు. అయితే రైతుల్లోనుంచి వచ్చిన వ్యతిరేకత, ప్రజాప్రతినిధుల నిలదీతలతో ప్రభుత్వం అసైన్డ్ రైతులను కూడా అర్హులుగా అవకాశం కల్పించింది.

వారం లోగా ఈకేవైసీ చేయించుకోవాలి:

అసైన్డ్ రైతులకు కూడా అన్నదాత సుఖీభవ జాబితాలో అర్హత కల్పిస్తూ తాజాగా ప్రభుత్వం అదేశాలు వచ్చాయి. రైతులందరు వారం లోగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. సమీప రైతు సేవాకేంద్రాల్లో కానీ, లేదా రాష్ట్రంలో ఎక్కడైనా రైతు సేవా కేంద్రాల్లో చేయించుకోవచ్చు. రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు సహకరించి ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలి.

వెంకట రమణ,(ఏడీఏ, కనిగిరి)

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి:

ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులకు అవకాశం కల్పించింది. రేషన్ కార్డుల్లోని ఏడు రకాల సర్వీసులను సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. కొత్త రేషన్ కార్డు కోసం, పిల్లలను జత పర్చడం, తొలగింపు, అడ్రస్‌లు మార్పు, కొత్తగా పెళ్లయినవారు మార్పు, జత చేయుట, సవరణలు, మరణాల తొలగింపు, కార్డులో వ్యక్తుల తొలగింపు ఇలా అన్ని రకాల సర్వీసులకు నెలాఖరు లోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి సచివాలయంలో ఈ ప్రక్రియలకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సచివాలయ ఉద్యోగులు కచ్చితంగా ప్రజలు సకాలంలో సేవలు అందించాలి.

ఏవీ రవిశంకర్, తహసీల్దార్, కనిగిరి

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

సీఎస్‌పురం(పామూరు): నూజివీడు ట్రిపుల్‌ఐటీకి మండలంలోని పెదరాజుపాలెంజెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని బత్తిని యశస్వి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు తెలిపారు. యశస్విని హెచ్‌యం, ఉపాధ్యాయులు అభినందించగా పాఠశాల ఉపాధ్యాయురాలు జె.నిర్మల, విశ్రాంత వీఆర్‌ఓ రామకృష్ణంరాజు రూ.7 వేల ఆర్థికసాయం చేశారు.

వీసీపల్లి: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ శ్రీనివాసులు, సంజీవ్ అభినందించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

మర్రిపూడి: మండలంలోని 3 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ ఎంవీవీ రంగయ్య తెలిపారు. కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఉలవపాటి నీహారిక, చల్లపల్లి తులసీ, మూలే ప్రత్యూష, రమావత్ సాయి సాత్విక, అట్లా బాల మనోహర్‌రెడ్డి, మర్రిపూడి హైస్కూల్‌కు చెందిన గురిజాల పల్లవి, గురిజాల దీపిక, గార్లపేట హైస్కూల్‌కు చెందిన శ్రావణిలు ఎంపికయ్యారు.

టంగుటూరు: మండలంలోని టంగుటూరు, ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. ఆలకూరపాడు పాఠశాలకు విద్యార్థినులు పుట్టా వెంకట భార్గవి, ఉప్పితెర్ల దివ్యశ్రీ డేగ వెంకట సాయి చరణ్‌లు ఎంపికయ్యారు.

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.ఇందిరమ్మ తెలిపారు. పాఠశాలలో చదివిన సీహెచ్ సంతోష్ నూజివీడు, టి.గంగోత్రి ఆర్‌కె వ్యాలీ, జి.క్రాంతికుమార్‌లు ఎంపికయ్యారు.

కందుకూరు రూరల్: మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై.అమూల్య సోమవారం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. హెచ్‌ఎం శ్రీను, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మున్సిపల్ షాపులకు వేలంపాట

కందుకూరు : కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతలారీ స్టాండ్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎస్సీ కేటగిరికి కేటాయించిన షాపు నంబర్ 1,3, ఎస్టీలకు కేటాయించిన షాపునంబర్-5, జనరల్ కేటగిరికి కేటాయించిన షాపునంబర్‌లు-13,15లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా నిర్మించిన వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్‌లో జనరల్ కేటగిరి కింద ఉన్న షాపు నంబర్-15,16లకు, కల్లూరి కోటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో జనరల్ కేటగిరి కింద ఉన్న 6,7షాపులకు, ముత్యాలకుంట వద్ద ఉన్న షాపులను నిర్వహించుకునేందుకు వేలంపాట ద్వారా కేటాయిస్తామన్నారు. వేలంపాట ఈనెల 28వ తేదీ ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీటీ చెంచురామయ్య

లింగసముద్రం: లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సీఎస్ డీడీ చెంచురామయ్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన వారికి ఈ నెల 26 నుంచే సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ సక్రమంగా పంపిణీ చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఐ రమణయ్య, డీలర్లు పాల్గొన్నారు.

నేడు స్పెషల్ గ్రీవెన్స్

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం స్పెషల్ గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ గ్రీవెన్స్‌లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ డిమాండ్ చేశారు. వలేటివారిపాలెం మండలంలోని నలదలపూరులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో వామపక్షాల ఒత్తిడితో ఉపాధీ హామీ చట్టాన్ని తెచ్చారని, ఈ చట్టం వచ్చిన తరువాత కూలీల జీవన విధానంలో మార్పులు వచ్చాయని తెలిపారు. కూలీలకు ఎంతో ఆసరాగా ఉన్న ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. సమ్మర్ అలవెన్స్‌లో కోత విధించడం, పనిలో మెటీరియల్ పర్సంటేజ్ పెంచడం, రెండుపూటలా పనిచేయాలని రెండు మస్టర్‌ల విధానాన్ని అవలంబించడం వంటి చర్యలకు పాల్పడుతుందన్నారు. కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించకుండా, ఈ పథకం కింద పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లను రెగ్యులర్ చేయకపోవడం, నిధులను పక్కదారి పట్టించడం వంటి చర్యల వల్ల ఈ పథకం నిర్వీర్యం అయ్యే పరిస్థితులు వచ్చాయని వివరించారు. కూలీలందరూ సమైక్యంగా ఉండి ఈ పథకాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్, కూలీలు బీరకాయల నర్సింగరావు, సాల్మన్, బి.శ్రీశైల, డి.జయమ్మ, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓగా పద్మజ


పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

కందుకూరు: కందుకూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓగా డాక్టర్ పి.పద్మజ నియమితులయ్యారు. ప్రకాశం ఇజిల్లా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా పనిచేస్తున్న పద్మజ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కందుకూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె పట్టణంలోని వడ్డిపాలెం, సంతోష్‌నగర్ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. జాతీయ ఆరోగ్య పథకాలకు సంబంధించి నూరు శాతం లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బ్యూలాగ్రేస్, స్టెల్లా కారుణ్య, జి. శ్రీనివాసులు, సీహెచ్‌ఓ షేక్ అబ్దుల్‌రహీం, సీనియర్ అసిస్టెంట్ ఐ పద్మావతి, పిహెచ్‌ఎన్ లత పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ


నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు, సంస్థ ప్రతినిధులు

కందుకూరు రూరల్: మండలంలోని మదనగోపాలపురం ప్రాథమిక పాఠశాలకు వై కాస్ట్ సంస్థ 400 నోట్ పుస్తకాలు అందజేశారు. ఎంఈఓలు బి.అజయ్‌బాబు, కె.సుబ్బారెడ్డి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు నర్రా రామయ్య, ఉపాధ్యాయులు శంకరయ్య, మాచవరం కాంప్లెక్స్ చైర్మన్ శ్రీను, అబ్దుల్లా, కె.మోహన్‌రావు, బాబ్జి, వై కాస్ట్ సంస్థ ప్రతినిధులు బాలభాస్కర్, వనజా పాల్గొన్నారు.

డబ్బులు కట్టించుకొని పైపులు ఇవ్వలేదు


పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసిన రైతులు

ఉలవపాడు: పైపుల కోసం నగదు చెల్లించినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. మహేంద్ర కంపెనీ ఆధ్వర్యంలో పైపులు ఇస్తారని చెప్పడంతో తాము నారాయణస్వామి అనే డీలర్‌కు నగదు జమచేశామని తెలిపారు. 5 నెలల క్రితం నుంచి పైపులు పంపిస్తామని చెబుతున్నారని, ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారికి కూడా తెలియజేశారని, వారూ మాట్లాడి నాలుగు రోజుల్లో వస్తాయని చెప్పారని తెలిపారు. కానీ ఎన్నిసార్లు ఫోన్ చేసి స్పందన లేదన్నారు. ఉలవపాడు, లింగసముద్రం, గుడ్లూరుకు చెందిన సుమారు 30 మంది రైతులు ఎస్సై అంకమ్మను కలిసి ఫిర్యాదు చేశారు.

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

లింగసముద్రం: పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామం నుంచి ఆశా కార్యకర్తగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందినవారై ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై 25 నుంచి 45 ఏళ్ల లోపు వయసు కలిగిన మహిళలు అర్హులని చెప్పారు. అర్హులు ఈ నెల 26 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన దద్దాల


వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, వలంటరీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆవుల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, బోడే కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓవీ రోడ్డుపై గుంతలు పూడ్చివేత


ఓవీ రోడ్డుపై గుంతలను సిమెంట్, కంకర్‌తో పూడ్చి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: కందుకూరు నుంచి ముత్తరాసుపాలెం వరకు ఓవీ రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడాయి. దీంతో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూ ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. గత ఏడాదిగా అధ్వానంగా ఉన్న ఓవీ రోడ్డును పాలకులు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో మంగళవారం సాక్షి పత్రికలో 'అధ్వాన రోడ్లు ఎన్నాళ్లీ అవస్థలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం సాయంత్రం ముత్తరాసుపాలెం, కొల్లగుంట అడ్డు రోడ్డు మధ్యలోని ఓవీ రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలను సిమెంట్, కంకరతో గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీపీఓ గొట్టిపాటి వెంకట నాయుడు

సీఎస్‌పురం(పామూరు): ఇంటిపన్ను వసూళ్ల వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని డీజీపేట సచివాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దర్శిగుంటపేట ఐవీఆర్‌ఎస్ కాల్స్ పురుగోతి 19 శాతం కంటే తక్కువగా ఉండటంపై పంచాయతీ కార్యదర్శిపై అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సీఎస్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో చలానా నమోదు, ఐవీఆర్‌ఎస్ కాల్స్, ఇంటిపన్ను వసూళ్ల పురోగతి, కంప్యూటరీకరణ, మొదలైన అంశాలపై ప్రస్తుత పరిస్థితి, కార్యాచరణపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డీ ఎంవీ రమణయ్య, పీఎస్‌లు వి.బ్రహ్మానందరెడ్డి, జి.వాణిరెడ్డి పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు పథకాలు వర్తింప చేయాలి



మాట్లాడుతున్న పీసీ కేశవరావు

కనిగిరిరూరల్: స్కీం వర్కర్లకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీఐటీయూ మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత చట్టాన్ని అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ముఠా, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిన గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఎస్‌కే బషీరా, నరేంద్ర, ఎన్ సీత, జి శారద, దేవదానం, కొండయ్య, బొర్రయ్య, యు పిచ్చయ్య, దావీదు, జె చార్లస్, సీహెచ్ లక్ష్మయ్య, రామ సుబ్బులు, పి.కొండలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు సహకరించాలి


వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: అక్రమణలు తొలగించి రోడ్ల నిర్మాణాలకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మంగలిమాన్యంలో మంగళవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో మంగలి మాన్యంలో సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. స్థానికులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ ఏఈ మాధవరావు, వర్క్ ఇన్స్‌పెక్టర్ షరీపుద్దీన్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో మేలు


చెరుకూరులో అవగాహన కల్పిస్తున్న ఏఓ రాము

పొన్నలూరు: పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వలన రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారి రాము అన్నారు. మండలంలోని చెరుకూరు, ముండ్లమూరివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసిన పచ్చిరొట్ట పైర్లపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగులు, పిల్లిపెసర పైర్లను పంట పొలాల్లో సాగుచేసి, పూత దశకు వచ్చిన సమయంలో వాటిని పొలంలో కలియదున్నాలన్నారు. ఇలా చేయడం వల్ల భూసారం పెరిగి పెట్టుబడుల ఆదాయంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

కందుకూరు: పంటల సాగుకు ముందుకు రైతులు విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వ్యవసాయాధికారి శేషారెడ్డి అన్నారు. మండలంలోని ఆయ్యవారిపల్లి, చుండి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. కంది, మినుము, వరి పంటల్లో ఒక కేజీ విత్తనానికి 10గ్రాముల సూడోమోనాస్, మినుముకు ఒక కేజీ విత్తనానికి 10గ్రాముల ట్రైకోడెర్మా విరిడి మందులతో విత్తనశుద్ధి చేస్తే పంటకు వచ్చే తెగుళ్లను నివారించవచ్చునని తెలిపారు. వ్యవసాయ సహాయకులు రవీంద్ర, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.